క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ రోజా కోరారు. మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ వద్దగల గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇంటర్ తత్సమాన కోర్సుల్లో 40శాతం మార్కులతో చదివిన, చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులను చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తులను వచ్చే ఫిబ్రవరి 5వ తేదీలోపు చేసుకునే అవకాశం ఉందని, ప్రవేశ పరీక్షను మార్చి 5వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు. కళాశాలలో ఎస్టీ విద్యార్థినుల తోపాటు నిబంధనల ప్రకారం ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులకు సీట్లు ఉన్నాయని, వీటిలో ఎస్టీలకు 34, ఇతరులకు 6 సీట్లు చొప్పున కేటాయించినట్లు చెప్పారు. ఎస్టీ విద్యార్థులకు అధిక ప్రాముఖ్యత ఉంటుందని, బీఎస్సీ (బీజెడ్‌సీ, ఎంపీసీ), బీఏ(హెచ్ఈపీ), బీకామ్ సీఏ గ్రూపులలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 7901097701, 6301982428 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టోర్నమెంట్ ప్రారంభం

దమ్మపేట: మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. మంగళవారం పట్వారిగూడెం గ్రామంలో నిర్వహించ తలపెట్టిన నియోజకవర్గస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, రిబ్బన్ కట్ చేసి ఆటను ప్రారంభించారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ మన్యం రమేష్, బీఆర్ఎస్ నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, సర్పంచ్ మొగిలి అంజలి, ఎంపీటీసీ కూరం కమల, ఉపసర్పంచ్ రెడ్డిమళ్ళ నాగయ్య పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

మణుగూరుటౌన్: దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రకు సంఘీభావంగా ఫిబ్రవరి 6న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రను జయప్రదం చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, టీపీసీసీ సభ్యులు చందా సంతోష్‌కుమార్, తాళ్ళూరి చంద్రశేఖర్ చక్రవర్తిలు కోరారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న రాహుల్ యాత్రకు ప్రజాదరణ పెరిగిందన్నారు. కార్యక్రమంలో మణుగూరు మండల అధ్యక్షుడు పిర్నాకి నవీన్, మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇక్బాల్ హుస్సేన్, గోడిశాల రామనాథం, బర్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

ములకలపల్లి: యువత విరివిగా రక్తదానంచేసి ఆదర్శంగా నిలవాలని పాల్వంచ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాల్వంచ బ్లడ్‌స్టోరేజ్ కమ్యూనిటీ హాస్పటల్ నేతృత్వంలో మండల కేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. స్థానిక పొగళ్లపల్లికి చెందిన సీఎం యూత్ ఆధ్వర్యంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డాక్టర్ సోమరాజుదొర, డాక్టర్ కల్యాణ్, సర్పంచ్‌లు వాడే నాగరాజు, సున్నం సుధాకర్, బ్లడ్‌బ్యాంక్ బాధ్యులు రమేష్, క్రిష్టఫర్, స్టాఫ్‌నర్స్ శ్రీలేఖ, చిరుమప్ప, రఫీ, కుంజా వెంకట్, సున్నం రాజు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయండి

అశ్వాపురం: బూర్గంపాడు ప్రాజెక్ట్ పరిధిలోని అశ్వాపురం మండలం కళ్యాణపురం సెక్టార్ సూపర్‌వైజర్‌గా పని చేస్తూ ఇటీవల దుమ్ముగూడెం డిప్యుటేషన్‌పై వెళ్లిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మిని వెంటనే సస్పెండ్ చేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అనుదీప్, పీడీ స్వర్ణలత లెనినాకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ధనలక్ష్మి అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ అధికారులు, స్థానిక విలేకరులపై నోటికి వచ్చినట్టు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల వేదికగా అవమానపరుస్తున్నారని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె మని, రెడ్డి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లలిత, రత్నకుమారి, నరసమ్మ, అరుణ, శ్రీలత, ప్రమీల, సరోజ, శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ డీఓకు వినతి

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఆయిల్‌పామ్ అశ్వారావుపేట జోన్ రైతు సంఘం ఆధ్వర్యంలో డీఓ (డివిజనల్ మేనేజర్)ఆకుల బాలకృష్ణకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం బాధ్యులు మాట్లాడుతూ.. పామాయిల్ రైతులకు జాప్యం లేకుండా ఎఫ్ కోడ్‌లను జారీ చేయాలని, కౌలు రైతులకు అగ్రిమెంట్ ప్రకారం ఎఫ్ కోడ్‌లు ఇచ్చి, నకిలీ కోడ్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో కొక్కెరపాటి పుల్లయ్య, తుమ్మా రాంబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, తగరం జగన్నాథం, గద్దం వెంకటేశ్వరరావు, తోట వీర్రాజు, పాకనాటి వెంకటేశ్వరరావు, వెలికె సత్యనారాయణ ఉన్నారు.

తీరాన్ని తోడేస్తున్నారు..!

- గోదావరిలో ఇసుకాసురుల పంజా
- యథేచ్ఛగా సాగుతున్న తోలకాలు
- పట్టింపులేని అధికారులు



గోదావరి తీరంలో కొనసాగుతున్న ఇసుక తవ్వకాలు (ఫైల్)

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని గోదావరి తీరం ఇసుకాసురులకు కాసుల పంట పండిస్తోంది. గంగోలు, లక్ష్మీనగరం, నుంచి మొదలుకుని రేగుబల్లి, సీతారాంపురం, దంతెనం, నర్సాపురం, తూరుబాక వరకు ప్రవహించే గోదావరిలో ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దుమ్ముగూడెం దగ్గర సీతమ్మసాగర్ బహుళార్థక సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో గోదావరి నీళ్లు పారకుండా కాపర్ డ్యాంను నిర్మించిన సంగతి తెలిసిందే. దీంతో గోదావరి నదిలో నీటి ప్రవాహం లేకపోవడం ఇసుకను తరలించే వారికి వరంగా మారింది. ఎక్కడికక్కడ అనధికారికంగా ఇసుకను రాత్రివేళల్లో తోలకాలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక దాదాపు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం అడ్డుకుని ఇసుక తరలిపోకుండా చూడాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా గంగోలు, రేగుబల్లి, సీతారాంపురం, దంతెనం గోదావరి నది నుంచి దాదాపు 20 ట్రాక్టర్లు ఇసుక రవాణాపై దృష్టిపెట్టి అక్రమంగా రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నాయనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

నామమాత్రపు చర్యలతోనే సరి..

మండలంలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై మండల అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటుండటంతో అవి పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రాత్రి నుంచి ఉదయం 8గంటల వరకు గత రెండు నెలలుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్న అధికారయంత్రాంగం పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అప్పుడప్పుడు నామమాత్రపు చర్యలతో సరిపెడుతూ ఇసుక రవాణాకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక ట్రాక్టర్ వాహనాలు పట్టుబడుతున్నా వాటిపై నామమాత్రపు జరిమానాలు, చర్యలు తీసుకున్నా శాశ్వత చర్యలు లేకపోవడంతో ఇసుకాసురులకు మామూలుగానే మారిపోయింది.

మైనింగ్ అధికారులూ సైలెంట్..

ఇసుక అక్రమ రవాణా లక్ష్మీనగరం గ్రామం ప్రధాన రహదారిపై నిత్యం రాత్రుల్లు మొదలై ఉదయం వరకు ఇసుక తోలకాలు జరుగుతున్నాయి. మండల అధికారులు మొత్తం ఉండే లక్ష్మీనగరం మీదుగా అక్రమంగా ఇసుక తోలకాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే.. భూగర్భజలాలు అడుగంటే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో అటు మైనింగ్ అధికారులు కూడా ఇసుక అక్ర రవాణాపై దృష్టి పెట్టకపోవడంపై పలు విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ఇసుక అక్రమ రవాణాపై కొరడా జూలిపించాలని కోరుతున్నారు.

పీడీ యాక్టు నమోదు చేస్తాం..



గోదావరి నది నుంచి ఇసుక తరలిపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే పట్టుబడిన వాహనాలను స్వాధీనం చేసుకుని పీడీ యాక్టు నమోదు చేస్తాం. సిబ్బంది తక్కువగా ఉండటంతో ఇసుక అక్రమ రవాణాపై సమాచారం వస్తున్న సమయానికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. అయినప్పటికీ ఉన్న సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తాం.

– చంద్రశేఖర్, తహసీల్దార్, దుమ్ముగూడెం

కేసులు నమోదు చేస్తాం..



దుమ్ముగూడెం నుంచి తూరుబాక వరకు ఉన్న గోదావరి నది నుంచి.. అలాగే గుబ్బల మంగి వాగు నుంచి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం. ఇసుక రవాణాపై నిఘాను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. గోదావరి నదిలోకి వాహనాలు వెళ్లినట్టు సమాచారం అందితే వెంటనే చర్యలు చేపడతాం.

– దోమల రమేష్, సీఐ, దుమ్ముగూడెం

గొంతెత్తినా ప్రయోజనం లేదు..



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చల్లా ప్రసాద్

అశ్వారావుపేటరూరల్: ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో అనేక సమస్యలపై తాము గొంతెత్తి మొరపెట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు పలుశాఖల అధికారులకు ప్రోటోకాల్ పట్టడం లేదని అన్నారు. ప్రతిసారి సమావేశంలో అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చిన కనీసం స్పందించడం లేదని వాపోయారు. తాగునీటి ట్యాంకులు, విద్యుత్ శాఖ ఏసీడీ చార్జీలు, మట్టి తరలింపునకు అనుమతులు తదితర అంశాలపై చర్చించారు. ఓ సందర్భంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. మట్టి సరఫరాపై కొంతమంది సోషల్ మీడియాలో లేనిపోని పోస్టులు పెడుతున్నారని, ఇలాంటి పరిస్థితి ఉంటే తాను చేసేదేమిలేదని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, ఎంపీడీఓ విద్యాధరరావు, పీఆర్ ఏఈ శ్రీధర్, ఐటీడీఏ ఏఈఈ ప్రసాద్, ఎంఈఓ కృష్ణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దొంగతనాలపై కఠిన చర్యలు

అశ్వాపురం: కొంత మంది యువకులు అక్రమ సంపాదన, ఈజీ మనీకి అలవాటై దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం ఎస్సై జితేందర్ హెచ్చరించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో వరుస దొంగతనాలపై గ్రామంలో చేపట్టాల్సిన చర్యలపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అధ్యక్షతన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సై జితేందర్ మాట్లాడుతూ గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే ప్రజలు వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలోని ప్రజలు ప్రధాన కూడళ్లలో సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, పంచాయతీ కార్యదర్శి సైదులు, ఇంటిలిజెన్స్ ఏఎస్సై శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, గ్రామ పెద్దలు కమటం వెంకటేశ్వరరావు, జాలె రామకృష్ణారెడ్డి, మిట్టకంటి వెంకటరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి, మన్మథరెడ్డి, గోవర్ధనాచారి, సురేందర్‌రెడ్డి, తూము సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, అశోక్, స్థానికులు, యువకులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు తగ్గించాలి

దుమ్ముగూడెం: విద్యుత్ వినియోగదారులకు సమాచారం ఇవ్వకుండా సామాన్య ప్రజలకు అధిక భారం మోపుతున్న ఏసీడీ విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ములకపాడు సెంటర్‌లో ఉన్న యలమంచి సీతారామయ్య భవనంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రజలపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు విద్యుత్ నియంత్రణ మండలిస్తున్న మితిమీరిన స్వేచ్ఛ ఫలితంగా విద్యుత్ వినియోగదారులపై భారాలు అధికమవుతున్నాయని అన్నారు. ఏసీడీ చార్జీలు తగ్గించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సోయం వీర్రాజు, జిల్లా కమిటీ సభ్యురాలు ఈనుగుర్తి రాజేశ్వరి, అపక రంగయ్య, గట్టుపల్లి వెంకటేశ్వర్లు, కొరసా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

జాతీయ బాలికా దినం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థినుల సమక్షంలో కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు బాలికల ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. బాలికలు గతంలో నున్యత భావానికి గురికావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుత సమాజంలో నూతన మార్పులకు అనుగుణంగా ఉన్నత శిఖరాలలో ఉన్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: బాలికలకు కరాటే శిక్షణనిస్తున్న మాస్టర్ శేఖర్



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ సున్నం లలిత



చండ్రుగొండ: కస్తూర్బాలో బాలికలకు కరాటే తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పోస్టర్లు ఆవిష్కరణ

అశ్వారావుపేటరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మత్స్యశాఖ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల రిజిస్ట్రేషన్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్–2కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీఓ విద్యాధరరావు, మత్స్యశాఖ మండల ఇన్‌చార్జ్ మిడియం మంగరాజు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రదీప్

భద్రాచలంఅర్బన్: యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎడారి ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. భద్రాచలానికి చెందిన ఆయనకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు శివసేనారెడ్డి, సాయిశంకర్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వెంకట్, ప్రభాకర్ ప్రోత్సాహంతో జిల్లాలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

అశ్వాపురం: జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ స్వర్ణలత లెనినాను ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఇటీవల పీడీగా బాధ్యతలు చేపట్టిన స్వర్ణలత లెనినాను ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె మని, రెడ్డి అరుణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా టీచర్లు పీడీతో మాట్లాడారు.

బీఎస్పీ సంతకాల సేకరణ

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ బీఎస్పీ ఇంచార్జి ఆలెం కోటి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బీసీ కుల గణన చేపట్టాలని కోరుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజవర్గ ఇంచార్జి ఆలెం కోటి, బీఎస్పీ జిల్లా కార్యదర్శి పాకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్‌ను 27శాతం నుంచి 52శాతంకు పెంచాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు ఇర్పా రవికుమార్, నాయకులు ఆదిలక్ష్మి, అరుణ, మౌనిక, కృష్ణ, వెంకటేశ్వర్లు, రఘు, శివకుమార్, రంగబాబులు పాల్గొన్నారు.

కార్మికుడికి పరామర్శ

ములకలపల్లి: పెయింటింగ్ పనులు చేస్తూ కిందపడి గాయపడ్డ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పెనుబల్లి శ్రీనువాస్‌ను బీఆర్ఎస్ నియోజవర్గ నాయకులు జారె ఆదినారాయణ పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తుల అంజితో కలసి శ్రీను గృహనికి వెళ్లి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు సమన్వయసమితి మండలాధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు మేకల పెద్దవెంకన్న, శనగపాటి రవి, వంజరపు ఉమేశ్ సర్దార్, మడకం చిరుమప్ప, సంపత్, సురభి రాజేశ్ తదితరులు ఉన్నారు.

'మినీమేడారం' ఏర్పాట్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: మండలంలోని తోగ్గూడెం గ్రామంలోని శ్రీసమ్మక్క–సారలమ్మ మినీ మేడారంలో నిర్వహిస్తున్న జాతర ఏర్పాట్లను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మంగళవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణమంతా కలియతిరిగి పరిసరాలను, భక్తుల సౌకర్యార్థం కల్పిస్తున్న తాగునీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ రాజకీయాల్లోకి అడుగిడుతున్న సీఎం కేసీఆర్ జీవితం ఆయురారోగ్యాలతో మరిన్ని విజయాలతో సాగాలని అమ్మవార్లను వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి 4వ తేదీ వరకు జరిగే మినిమేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మినిమేడారం జాతర కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు,తోగ్గూడెం సర్పంచ్ బొగ్గం రజిత, ఏరియా ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ పుట్టినరోజు వేడుకలు

దుమ్ముగూడెం: రాజ్యసభ సభ్యుడు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్న బండి రేవు గ్రామంలోని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు పూదోట సూరిబాబు నివాస గృహంలో, లక్ష్మీనగరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేసి వద్దిరాజు రవిచంద్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పాలు, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో పర్ణశాల వైద్యాధికారి రేణుక రెడ్డి, మున్నూరు కాపు సంఘం నాయకులు తంత్రపల్లి వెంకటేశ్వరరావు, లంకా శివ, బోనాసి వెంకటేశ్వరరావు, కొమ్ము సురేందర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘ గౌరవ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర(గాయత్రి రవి) జన్మదిన వేడుకలను మణుగూరు మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వన్నం కృష్ణమోహన్, గాండ్ల సురేష్, వలసాల వెంకటరామారావు, మామిడిపల్లి సీతారాములు, గాజుల రమేష్, ఎడవల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణస్వీకారం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ వాసవీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ సమన్వయకర్త చారుగుళ్ల శ్రీనివాస్ పాల్గొని అధ్యక్ష కార్యదర్శి, కోశాధికారితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో యశోద రామచంద్రరావు, బ్రహ్మదేవర విజయకుమార్, చారుగుళ్ల వెంకట నాగభూషణం, కృష్ణయ్య, కృష్ణ, వెంకట పుల్లారావు, భద్రం, రామారావు, రేపాక శ్రీనివాస్, నాళ్ల సాయిచందు, శ్రీరామ్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంటివెలుగు శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మణుగూరురూరల్: మండలంలోని పైలట్‌కాలనీ ప్రాంతంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కంటివెలుగు పరీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురికి కంటివైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ వరకు పాఠశాలలో కంటివెలుగు శిబిరం ద్వారా నేత్రవైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాళీమాత ఏరియాలోని 18 సంవత్సరాలు నిండిన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటిపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్, నేత్ర వైద్యాధికారి సంజీవరావు, సీహెచ్ఓ వెంకన్న, హెచ్‌వి దయామని, దివ్య, సీమా, పీహెచ్‌సీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చర్ల: గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వృద్ధులు, వితంతువులకు మంగళవారం నిత్యావసరాలు, దుస్తులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పూజారిగూడెం జీటీఎస్ఎస్ఎస్ చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహశీల్దార్ బి.భరణిబాబు చేతుల మీదుగా పూజారిగూడెం, కొత్తూరు, గన్నవరంకాలనీ, సాయినగర్‌కాలనీ, దండుపేటకాలనీ, సింగసముద్రం, పెద్దిపల్లి తదితర గ్రామాలకు చెందిన 65 మందికి నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, చీరెలు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ బి.భరణిబాబు మాట్లాడారు.

కార్మికుల నిరవధిక సమ్మె

మణుగూరురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కార్మికులు కంపెనీ కార్యాలయం ఎదుట మంగళవారం నుంచి నిరవధిక సమ్మెను చేపట్టారు. నిరవధిక సమ్మెకు ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.లక్ష్మీనారాయణ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత రెండేళ్ళుగా ప్రీమియర్ ఎక్స్‌ప్లోజీవ్ కంపెనీ యాజమాన్యం కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా కంపెనీ యాజమాన్యం మొండివైఖరిని వీడి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు తోట రమేష్, కార్యదర్శి అక్కి నరసింహరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సర్వర్, సోందె కుటుంబరావు, వీరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో నిర్మిస్తున్న రామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామంలోని డెయిరిఫామ్ నిర్వాహకుడు నున్నా సత్యం రూ.50,016 మంగళవారం డెయిరిఫామ్ బాధ్యుడు కల్యాణ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడి కృష్ణవేణి, ఉపసర్పంచ్ చావా వీరరాఘవులు, ఆలయ కమిటీ చైర్మన్ మామిడి శ్రీనివాస్, గ్రామపెద్దలు కోడి అమరేందర్, వేల్పుల వెంకన్న, గొడుగు నాగేశ్వరరావు, గొడ్డుగుర్ల వెంకటేశ్వర్లు, సురకంటి వేణు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

షెడ్డుపై రేకులు వేయరా..?



రాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీలో లక్షలు వెచ్చించి శ్మశాన వాటికల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. శ్మశాన వాటికల్లో స్నానాలు చేసేందుకు, బట్టలు మార్చుకునేందుకు షెడ్లను నిర్మించారు. ఈ నేపథ్యంలో గత వర్షాకాలంలో వచ్చిన గాలి దుమారాలకు మండలంలోని గుంపెన పంచాయతీలో నిర్మించిన శ్మశానవాటిక షెడ్డుపై రేకులు ఎగిరి పోయాయి. నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, నూతనంగా రేకులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: రేవతి, ఎంపీడీఓ, అన్నపురెడ్డిపల్లి
ఫోన్ నంబర్: 9642621309